విద్యార్థులకోసం

# తెలుగు సామెతలు

దుర్గెంపూడి చంద్రశేఖర రెడ్డి
లక్ష్మణ్‌రావు పతంగే

ఎమెస్కో

## అ

**అంకెలేని కోతి లంకంతా చెఱచిందట.**

అదుపులేని వ్యక్తి అంతా చెడగొడతాడు.

**అంగట్లో అన్నీ ఉన్నవి, అల్లుని నోట్లో శని ఉన్నది.**

అన్నీ అందుబాటులోనే ఉన్నా అనుభవానికి రాకపోవడం.

**అంగట్లో అరువు; తలమీద బరువు!**

అప్పు ఎప్పుడూ భారమే.

**అంగిట విషం, మున్నాలిక తియ్యదనం.**

మనస్సులో విషం పెట్టుకొని తీయగామాట్లాడడం.

**అంచు డాబేకాని, పంచె డాబుకాదు.**

మెరమెచ్చులే కాని ఏమీలేదని భావం.

**అంటనప్పుడు ఆముదం రాచుకొన్నా అంటదు.**

కాలం కలసిరానప్పుడు ఏ పని చేసినా కలిసిరాదు.

**అంటే ఆరడి అవుతుంది, అనకుంటే అలుసవుతుంది.**

ఏమి చేయాలో పాలుపోని స్థితి, ముందు నుయ్యి, వెనుక గొయ్యి.

**అంత ఉరిమీ ఇంతేనా కురిసేది?**

మాటలు గొప్పేకాని చేతలు తక్కువని.

**అంతకు తగిన గంత, గంతకు తగిన బొంత.**

ఒకరికొకరు సరిపోయారని (తిరస్కారార్థంలో).

**అంతపెద్ద పుస్తకం చంకలో ఉన్నదే పంచాంగం చెప్పలేవా అన్నట్లు.**

ఎదుటి వాణ్ణి చూసి అన్నీ అతనికి తెలుసునని భ్రమించడం.

## ఆ

**ఆ ఊరికి ఈ ఊరు ఎంత దూరమో, ఈ ఊరి కా ఊరు అంతేదూరం.**

రెండూ సమానమే అని చెప్పడం.

**ఆ ఊరిదొర ఈ ఊరికి తలారి.**

వ్యక్తుల మర్యాద తమ ఊరికే పరిమితమని చెప్పడం. మరో ఊరికి పోయినప్పుడు మనమెంతటి వారమైనా వారు లక్ష్యపెట్టరు.

**ఆకలి రుచి ఎరుగదు, నిద్ర సుఖమెరుగదు.**

ఆకలి లేనప్పుడు ఎంతరుచికరమైన పదార్థమైనా నచ్చదు. నిద్రరానప్పుడు ఎంతటి పట్టు పరుపులతోనూ ఉపయోగముండదు. ఆకలైతే ఏదైనా రుచిగానే ఉంటుంది. నిద్రవస్తే ఎక్కడైనా నిద్రపడుతుంది.

**ఆకాశానికి నిచ్చెన వేసినట్లు.**

పగటి కలలు కనడం, అసాధ్యమైన వాటి కోసం ప్రయత్నం చేయడం.

**ఆడలేనమ్మ మద్దెల ఓడన్నట్లు.**

తనకు రాదని చెప్పలేక కుంటిసాకులు వెతకడం.

**ఆ తానులోదే ఈ పేలిక.**

అన్నీ ఒకేరకమైనవని చెప్పడం

**ఆదిలోనే హంసపాది.** (దు)

ప్రారంభించాల్సిన పనికి ప్రారంభానికి ముందే ఆటంకం కలగడం.

**ఆపదలో అడ్డుపడేవాడే చుట్టము.**

ఆత్మీయులు ఎంతమంది ఉన్నా మనకు ఆపదలో ఆదుకొన్నవాడే ఆప్తుడు.

**ఆయాసం ఒకరిది అనుభవం ఇంకొకరిది.**

కష్టం ఒకరిదైతే లాభం మరొకడికి లభించడం.

**ఆరిపోయెడి దివ్వె కధిక దీప్తి.**

ఆరిపోయే ముందు దీపం బాగా వెలుగుతుంది. తాత్కాలిక మని అర్థం.

## ఇ

**ఇంగువ కట్టిన గుడ్డ, బెల్లం వండిన పొయ్యి.**

కొన్ని వస్తువులు అవి లేకపోయినా వాటి తాలూకు స్మృతులు మిగులుతాయి. బిడ్డచచ్చినా పురిటికంపుపోనట్లు.

**ఇంట గెల్చి, రచ్చ గెలువు.**

ఇంట్లోనే గెలవలేని వాడు, ప్రపంచంలో ఏంగెలుస్తాడు. అందుకని ఏదైనా ఇంట్లోనే ప్రారంభం కావాలి.

**ఇంటి ఎద్దుకు బాడుగ ఏమిటి?**

మనదైన వస్తువుకు మనమే పరాయివాళ్లం కాకూడదు.

**ఇంటికన్నా గుడి పదిలం.**

ఇంట్లో సౌఖ్యాలు కొరవడితేనే మనిషి దైవచింతనలో పడుతాడు.

**ఇంటికళ ఇల్లాలె చెబుతుంది.**

భాండ శుద్ధియే తెలుపుభామిపొలుపు అన్నారు. ఇంటిని ఉంచుకునే తీరులోనే ఇల్లాలి మనస్తత్వం తెలిసిపోతుంది.

**ఇంటిగుట్టు పెరుమాళ్ల కెరుక.**

ఇంటి రహస్యం దేవుడికి తప్ప ఎవరికీ తెలియదని

**ఇంటిగుట్టు పొరుగిండ్లలో చెప్పే ఆడ(డు) బిడ్డతో పాటు దొంగిలించే కోడలు దొరికినట్లు.**

ఒకదానికొకటి తోడుకావడం. గోరుచుట్టుపై రోకటి పోటు.

**ఇంటిగుట్టు లంకకు చేటు.**

ఇంటి రహస్యం బయట తెలిస్తే అది మనకే నష్టదాయకమవుతుంది. విభీషణుడి వల్ల రావణుడి లంకకు చేటు మూడినట్లు.

**ఇంటిదీపమని ముద్దుపెట్టుకుంటే, మీసాలన్నీ తెగ కాలినవట!**

దేనినైనా అతిగా గారాబం చేయరాదు. మనం తేలికగా తీసుకుంటే చివరికది మన పరువుపోయేట్లు చేస్తుంది.

**ఇల్లలుకగానే పండు గౌతుందా?**

ఏ పనైనా కేవలం ప్రారంభిస్తే మాత్రమే పూర్తిగాదు. దాని కోసం ఎంతో కష్టపడాల్సి ఉంటుంది.

**ఇల్లు కట్టిచూడు, పెళ్లి చేసిచూడు.**

కేవలం మాటలతో సరిపోదు. కొన్ని పనులు స్వయంగా చేస్తేగాని వానిలోని సాధకబాధకాలు తెలియవు. ఇల్లు కట్టడం, పెళ్ళి చేయడం రెండూ కష్టసాధ్యమైన పనులే.

**ఇల్లు పీకి, పందిరి (లి) వేసినట్లు.**

ఉన్నదాన్ని పాడుచేయడం. ఇల్లంత చిందరవందర చేయడం. గొడవ చేయడం.

**ఇసుక తక్కెడ, పేడ తక్కెడ (గాంధ్రు).**

ఒకరినిమించి ఒకరు మోసగాళ్లు.

## ఈ

**ఈతచెట్టుకింద (తాటిచెట్టు) పాలుతాగినా కల్లే అంటారు!**

నిందనీయస్థలాల్లో మంచిపనిచేసినా నిందేవస్తుంది.

**ఈనగాచి నక్కలపాలు చేసినట్లు.**

ఎంతో శ్రమించి తీరా ఫలితం ప్రాప్తించే సమయాన నిర్లక్ష్యం చేసి సిద్ధించే పనిని పాడుచేసుకోవడం.

**ఈవలిగట్టున ఉండే ఆవుకు ఆవలిగట్టు పచ్చన.**

కళ్ళముందు కనిపించేదాన్ని వదలు కొని దూరంలో ఉన్నదాన్ని ఆశించడం. దూరపు కొండలు నునుపు.

## ఉ

**ఉంగరాల చేతితో మొట్టేవాడు చెబితేనే వింటాడు.**

కొంత మంది మంచి మాటలతో వినరు. గద్దించి చెప్పే వాళ్ళుంటేనే వింటారు.

**ఉపాయం లేనివాణ్ణి ఊళ్లోనుంచి వెళ్లగొట్టుమన్నారు.**

మనిషి సంఘజీవి, సంఘంలో ఉన్నప్పుడు ఎలా మసలు కోవాలో తెలిసి ఉండాలి. లేకపోతే పదిమంది ముందర ఆభాసుపాలవుతారు.

**ఉప్పులేని పప్పు, ఊరగాయలేని సద్ది.**

ఉప్పులేని పప్పు, ఊరగాయలేని సద్ది ఎలా రుచిగా ఉండవో అలాగే ప్రధానమైన దినుసు, గుణం లేనిదేదీ బాగుండదని అర్థం.

**ఉయ్యాలలో బిడ్డనుపెట్టి, ఊరంతా వెదకినట్లు.**

చేతిలో వస్తువు పెట్టుకొని అక్కడా ఇక్కడా వెతికినట్లు

**ఉల్లిచేసిన మేలు తల్లి అయినా చేయదు.**

ఉల్లి వల్ల ఎన్నెన్నో ఉపయోగాలున్నాయని చెప్పడం.

## ఊ

**ఊరంతా ఒకత్రోవ, ఉలిపికట్టెది ఇంకొక త్రోవ.**

కొంతమంది ఊరిజనమంతా ఒక పక్షమై మాట్లాడుతుంటే తాము మాత్రం తానుపట్టిన కుందేలుకి మూడే కాళ్లున్నట్లు వాదిస్తుంటారు.

**ఊరకున్నవాడిని ఊరేమి చేయలేదు.**

మాటలతోనే మిత్రత్వం, శత్రుత్వం ఏర్పడతాయి. అందుకే ఊరకున్నవాడు ఏ పక్షమూ వహించడు గాబట్టి వాణ్ణెవరూ ఏమీ అనరు.

**ఊరిదగ్గరి చేనుకు అందరూ దొంగలే.**

ఉన్న ఊరిలో ఉద్యోగం, ఊరినానుకొని వ్యవసాయం చేయరాదంటారు పెద్దలు. ఊరికి దగ్గర కాబట్టి ఎవరైనా ఎప్పుడైనా కోసుకోవడానికి అనుకూలం.

**ఊసరక్షేత్రంలో పైరు, నీరులేని చెరువుక్రింద సేద్యము.**

పరిస్థితులను బట్టి పనులు చేయాలి కాని పూర్వాపరాలు ఆలోచించకుండా చేయరాదు.

**ఊహలు ఊళ్లేలుతుంటే, కర్మం కట్టెలు మోస్తున్నది.**

తానున్న స్థితిని మరచి గాలి మేడలు కట్టడం. కర్మను కాదని ఎవడూ ఏమీ చేయలేదు.

# ఎ

**ఎండగాచినచోట వెన్నెల గూడ కాసేది.**

ఏదీ శాశ్వతం గాదు. కష్టసుఖాలు కావడికుండలు. ఒకదాని తరువాత ఒకటి వస్తాయి. కష్టం వచ్చిందని బాధపడకూడదు, దాని తర్వాత సుఖమూ వస్తుంది.

**ఎంతచెట్టు కంత గాలి.**

మనిషి స్థాయిని బట్టే ఏదైనా ఉంటుంది.

**ఎంత పండినా కూటికే, ఎంత ఉండినా కాటికే.**

కొన్ని వస్తువులు జరగబోయే పరిణామం నుండి తప్పించుకోలేవు. పంటలు పండించడమే కూటి కొరకు గాని దాచిపెట్టడానికి కాదు. అలాగే ఎంత కాలం బతికినా కాటికి పోక తప్పదనేది నిజం.

**ఎంత సంపదో అంత ఆపద.**

ధనవంతుడు సుఖపడతాడనుకోవడం భ్రమ. సంపద ఎంత ఎక్కువయితే కష్టాలు కూడా అంతే ఎక్కువవుతాయి.

**ఎద్దుకొద్దీ సేద్యం, సద్దికొద్దీ పయనం.**

ఓ పనికీ పూనుకునేముందర పూర్వాపరాలు ఆలోచించాలి. బలిష్ఠమైన ఎడ్లుంటేనే వ్యవసాయానికి పనికి వస్తాయి.

అలాగే మనం చేసే ప్రయాణం. సద్దిమూట ప్రయాణానికి సరిపోనుంటే ఏ కష్టముండదు. దారి మధ్యలో అయిపోతే అవస్థలు తప్పవు.

**ఎద్దుపుండు కాకికి ముద్దు?**

ఒకరి బాధ మరొకరికి ఆనందాన్ని కలిగిస్తుంది.

**ఎముకలేని నాలుక, ఏమయినా పలుకుతుంది/నరాలు లేని నాలుక నానా విధాల పలుకుతుంది.**

కాలు జారితే తీసుకోవచ్చుగాని నోరు జారితే తీసుకోలేమన్నారు పెద్దలు. అందుకే నాలుకమీద నియంత్రణ అవసరం.